



రోడ్ షోలో మాజీ సీఎం కేసీఆర్ అభివాదం

మానుకోటలో కేసీఆర్ రోడ్ షోకు హాజరైన జనం

ఉచిత బస్సు తప్ప.. అంతా ఉత్తుత్తే

- కాంగ్రెస్ దుష్ట పరిపాలనలో హామీలేవీ నెరవేరడం లేదు
- మానుకోట జిల్లా ఉండాలంటే. బీఆర్ఎస్ గెలవాలె
- బస్సుయాత్ర, కార్నర్ మీటింగ్‌లో మాజీ సీఎం కేసీఆర్

మహబూబాబాద్, మే 1 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ దుష్ట పరిపాలనలో ఉచితబస్సు తప్ప.. ఇతర హామీలేవి అమలు కావడం లేదని మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ఆరోపించారు. పార్ల మెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మాజీ సీఎం కేసీ ఆర్ నిర్వహిస్తున్న బస్సుయాత్ర బుధవారం సాయంత్రం భద్రాద్రికొత్తగూడెం జిల్లా కేంద్రం నుంచి రాత్రి 7.10గంట లకు మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి చేరుకుంది. కానీ ఆయన ప్రచారంపై బుధవారం రాత్రి 8గంటల నుంచి 48 గంటల పాటు ఎన్నికల కమిషన్ నిషేధం విధించిన నేప థ్యంలో.. 7.20గంటలకు ఇందిరాగాంధీ సెంటర్‌కు చేరు కున్న ఆయన 14 నిమిషాల పాటు ప్రసంగించారు. తాను మారుమూల గిరిజన ప్రాంతమైన మహబూబాబాద్‌ను జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేస్తే.. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ఎత్తివేస్తామని స్పష్టంగా చెబుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. వీటన్నింటికి బ్రేక్ వేయాలంటే లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు. తన ప్రచా రంపై 48 గంటల పాటు నిషేధం విధిస్తే.. బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు 96 గంటలు అవిశ్రాంతంగా పనిచేస్తారని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పాలనలో రైతులు నష్టపోతున్నా రని, కరీంనగర్ జిల్లాలో వడ్లు కొనడం లేదని, వాటిని ఆర బెట్టుకున్న ఓ రైతు కుప్పకూలి గుండెఆగి మృతి చెందాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఉచిత బస్సు పథకంతో ఆటోరిక్షా కార్మి కులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ 50 ఏళ్ల పాలనలో ఈ ప్రాంతానికి ఎన్నడు నీళ్లు రాలేదని, వెన్నవరం కాలు వల ద్వారా చుక్క నీరు రాలేదని, కాళేశ్వరం కట్టిన తర్వా తనే వెన్నవరం కాలువల ద్వారా నీళ్లు వచ్చాయని వివరిం చారు. ఈ ఏడాది కాళేశ్వరం ప్రాజెక్టు నీరు ఎందుకు రాలే దంటూ ప్రజలను ఈ సందర్భంగా కేసీఆర్ ప్రశ్నించారు. కాంగ్రెస్ అరచేతిలో వైకుంఠం చూపిస్తోందని, రైతుబంధు ఇవ్వడం లేదని, అనేక హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చిందన్నారు. తెలంగాణకు న్యాయం చేసేందుకు తనగొంతులో ప్రాణం ఉన్నంత వరకు పోరాడుతానని స్పష్టం చేశారు. బీజేపీ మోదీ ప్రభుత్వం గోదావరి నీళ్లను తీసుకుపోతోందని, సీఎం రేవంత్‌రెడ్డి మౌనంగా ఉన్నారని మండిపడ్డారు. మహబూబాబాద్, డోర్నకల్, నర్సంపేటల్లో తాగునీటి సమస్య అధికంగా ఉందని, ఖమ్మంలో మురికినీరు వస్తోందని విచారం వ్యక్తం చేశారు. కరెంట్, భగీరథ పథకాలు ఎక్కడికి పోయాయ యని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో గిరిజనులను గౌర వించలేదని, మహబూబాబాద్ ప్రాంతంలో సేవాలాల్ దేవాలయాన్ని బీఆర్ఎస్ పాలనలో నిర్మించామని, గిరిజనులకు రిజ ర్వేషన్లను కల్పించామని కేసీఆర్ పేర్కొన్నారు. ఈ కార్నర్ మీటింగ్‌లో మహ బూబాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి మాలోతు కవిత, ఎమ్మెల్సీలు వద్దిరాజు రవి చంద్ర, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్సీలు తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, సత్యవతిరాథోడ్, మాజీ ఎమ్మెల్యేలు డీఎస్. రెడ్యానాయక్, బానోత్ శంకర్‌నాయక్, హరి ప్రియ, రేగ కాంతారావు, మానుకోట, ములుగు జడ్పీ చైర్‌పర్సన్‌లు అంగోతు బిందు, బడె నాగజ్యోతి, మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, పర్కాల శ్రీనివాస్‌రెడ్డి, కేఎస్ఎన్.రెడ్డి, గుడిపుడి నవీన్‌రావు, కుడితి మహేందర్‌రెడ్డి, యాళ్ల మురళీధర్ రెడ్డి, ఎండి.ఫరీద్, చిట్యాల జనార్దన్, షేక్. మహబూబ్‌పాషా, తేళ్ల శ్రీనివాస్, నాయిని రంజిత్, సుధాగాని మురళి, ముత్యం వెంకన్న పాల్గొన్నారు.



కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న కేసీఆర్

మాజీ సీఎం కేసీఆర్ ఖుషీ..

మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ కేంద్రంలో జరిగిన రోడ్‌షోకు జనం భారీగా తరలిరావ డంతో మాజీ సీఎం కేసీఆర్ ఖుషీ అయ్యారు. భద్రాద్రి జిల్లా నుంచి మానుకోటకు చేరుకున్న కేసీఆర్‌కు పట్టణ శివార్లలో నేతలు ఘన స్వాగతం పలికారు. ప్రభుత్వ ఆస్పత్రి నుంచి ఇందిరాగాంధీ సెంటర్ వరకు రోడ్‌షో నిర్వహించారు. బస్సులో నుంచే అభివాదం చేస్తూ ముందుకు సాగారు. ఈ క్రమంలో ఎమ్మెల్సీ, మాజీ మంత్రి సత్యవతిరా థోడ్, ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ తెలంగాణ పాట లకు నృత్యాలు చేశారు. సభ ప్రదేశంలో మాజీ సీఎం కేసీఆర్ చిత్ర పటాలతో ఎగురవేసిన బెలూన్లు ప్రత్యేక ఆకర్షణగా నిలవగా.. యంత్రాల ద్వారా చల్లిన గులాబీ రంగు కాగితాలతో ఆ ప్రాంతమంతా గులాబీమయమైంది.

లోక్‌సభ ఎన్నికలకు పూర్తిస్థాయిలో సన్నద్ధం కావాలి

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అద్వైత్‌కుమార్‌సింగ్, అధికారులు

మహబూబాబాద్, మే 1 (ఆంధ్రజ్యోతి) : పార్లమెంట్ ఎన్నికలకు పూర్తిస్థాయిలో సన్నద్ధం కావాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ సూచించారు. బుధ వారం హైదరాబాద్ నుంచి అదనపు ఎన్నికల అధికారులు లోకేష్‌కుమార్, సర్ఫరాజ్ అహ్మద్‌తో పాటు ఆయన జిల్లా ఎన్నికల అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, అదనపు సహా య రిటర్నింగ్ అధికారులు లెనిన్‌వత్సల్ టొప్పో, ఎం.డేవిడ్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే 13న పార్లమెంట్ ఎన్నికలను నిర్వహిం చేందుకు పార్లమెంట్ పరిధిలోని ఏర్పాట్లపై జిల్లా ఎన్నికల అధికారులు వివరాలు తెలియజేయాలన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అనుసరిస్తూ మహబూబా బాద్ పార్లమెంట్ పరిధిలోని 7 అసెంబ్లీ సెగ్మెంట్స్‌లో నామినేషన్ దాఖలు చేసిన వారిలో అభ్యర్థుల ఫైనలైజేషన్, గుర్తుల కేటాయింపు, ఈవీఎం బ్యాలెట్ పేపర్, పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్, పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాల వెబ్ కాస్టింగ్, ఎలక్టోరల్ సమాచారం, ఈవీఎం ర్యాండమైజేషన్, కమీషనింగ్, సీ-విజిల్ కంప్లైంట్స్, దరఖాస్తు ల అనుమతులు, ఎన్నికలకు నియమించిన సిబ్బందికి శిక్షణ తరగతులు, ఖర్చు వివరాలు, మీడియా సర్టిఫికేషన్, రూట్ వివరాలు, 12డీ ఓటర్ల తుది జాబితా వంటి అంశాలపై ఎన్నికల అధికారి అద్వైత్‌కుమార్‌సింగ్ వివరించారు. ఈ వీడియో సమా వేశంలో అధికారులు నర్మద, వెంకటేశ్వర్లు, జీనుగు మరియన్న, సుబ్బారావు, నాగ వాణి, వరలక్ష్మి, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం

- టీపీసీసీ అధికార ప్రతినిధి కత్తి వెంకటస్వామి



మాట్లాడుతున్న టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి కత్తి వెంకటస్వామి

మహబూబాబాద్ టౌన్, మే 1 : రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అత్యధిక స్థానాలు గెలుచుకుని, కేం ద్రంలో అధికారంలోకి రావడం ఖా యమని టీపీసీసీ అధికారప్రతినిధి, పార్లమెంట్ ఎన్నికల మేనేజ్‌మెంట్ కో-ఆర్డినేటర్ కత్తివెంకటస్వామి ధీమా వ్యక్తం చేశారు. మహబూబా బాద్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ, బీఆర్ఎస్‌ల మధ్య లోపాయికారి ఒప్పందం ఉందని ఆరోపించారు. మత విద్వే షాలను రెచ్చగొట్టి ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు బీజేపీ కుట్రలు చేస్తుందని రాష్ట్ర ఎన్నికల సంఘం, డీజీపీలకు ఫిర్యాదు చేశామని చెప్పారు. మతాల పేరిట విద్వే షాలు రెచ్చగొడుతూ ప్రసంగించడం రాజ్యాంగ విరుద్ధమని అయినా ప్రధాని మోదీ కి నోటీసులు ఇవ్వలేదని, సీఎం రేవంత్‌రెడ్డికి మాత్రం ఢిల్లీ పోలీసులు నోటీసులు ఇచ్చారని చెప్పారు. కేంద్రంలో మూడోసారి బీజేపీ అధికారంలోకి వస్తే రిజర్వే షన్లు రద్దు అవుతాయని, సామాన్యులే అంటున్నారని తెలిపారు. దేశానికి ప్రమాద కారిగా మారిన బీజేపీని ఓడించి, రాజ్యాంగ రక్షణ కోసం కాంగ్రెస్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. టార్గెట్ రాజకీయాలు చేస్తున్న బీజేపీని ఇంటికి పంపించాలని కోరారు. మానుకోట పార్లమెంటరీ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి పోరిక బలరాంనాయక్ 3లక్షల మెజార్టీతో గెలుపొందడం ఖాయమని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మేకల వీరన్నయాదవ్, మాజీ జడ్పీటీసీ హెచ్.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఘనంగా మేడే

వాడవాడలా రెపరెపలాడిన ఎర్ర జెండాలు



మహబూబాబాద్ మేడే ఉత్సవాల్లో ఎమ్మెల్సీ రవీందర్‌రావు, మునిసిపల్ చైర్మన్ రాంమోహన్‌రెడ్డి

మహబూబాబాద్‌టౌన్, మే 1 : మహబూబా బాద్ టౌన్, మే 1 : మానుకోట పట్టణంలో మే డేను బుధవారం ఘనంగా జరుపుకున్నారు. కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఉత్సవాలను నిర్వ హించారు. కార్మికులు వాడవాడలా ఎర్రజెండా లను ఎగురవేశారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ర్యాలీలకు అనుమతి లేకపోవడంతో ఆఫీస్‌ల్లో జెండాలు ఎగురవేసి, సభలను నిర్వహించారు.

- జిల్లా కేంద్రంలోని వీరభవన్‌లో సీపీఐ, ఏఐటీ యూసీల ఆధ్వర్యంలో మేడే ఉత్సవాలను నిర్వ హించారు సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయసా రథి ఎర్రజెండాను ఎగురవేశారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో కార్మిక పోరాటాల వల్ల హక్కులు, చట్టాలను సాధిం చుకున్నామని చెప్పారు. దేశంలో ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్ పరం చేస్తున్న ప్రధాని మోదీని గద్దె దించాలన్నారు. ఈ కార్యక్ర మంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యద ర్శులు బి.అజయ్‌సారథిరెడ్డి, రేషపల్లి నవీన్, పెరుగుకుమార్, పాండురంగాచారి, చింత కుంట్ల వెంకన్న, సాంబలక్ష్మి, సందీప్, శ్రావణ్, వీరన్న, లింగ్యా, చిరంజీవి, అశోక్, చిరంజీవి, జక్కురయ్య శంకర్ పాల్గొన్నారు.
- సీపీఎం, సీఐటీయూల ఆధ్వర్యంలో మేడేను జరుపుకున్నారు. పెరుమాండ్లజగన్నాథం భవ న్‌లో సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీని వాస్ అరుణపతాకాన్ని ఎగురవేశారు. మాను కోట పట్టణంలో 60 సెంటర్లలో ఎర్రజెండాలు ఎగుర వేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సాదుల శ్రీనివాస్ మాట్లాడుతూ కార్మికులు, కర్షకులు దేశ నిర్మాతలని వారి హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వాలు పతనం కాక తప్పదన్నారు. ఈ కార్య క్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకుల రాజు, కుంట ఉపేందర్, బానోత్ సీతారాంనాయక్, కుమ్మరి కుంట్ల నాగన్న, గాడి పెల్లి ప్రమీల, సమ్మెట రాజ మౌళి, చీపిరి యాకయ్య, అల్లి శ్రీనివాస్‌రెడ్డి, బానోత్ వెంకన్న, యమగాని వెంకన్న పాల్గొన్నారు.



మానుకోటలోని వీరభవన్ వద్ద ఎర్రజెండాను ఎగురవేస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి విజయసారథి

- మానుకోటలో న్యూ డెమోక్రసీ, ఇఫ్టూ ఆధ్వ ర్యంలో మేడేను జరుపుకున్నారు.శ్రీరామరైస్ మిల్, రాజ్‌దాల్‌మిల్, వ్యవసాయ మార్కెట్ సెంటర్, మిల్ డ్రైవర్స్ భవననిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మేడే నిర్వహించుకుని ఎర్ర జెండాలను ఎగుర వేశారు. ఈ కార్యక్ర మంలో సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకుడు మండల వెంకన్న, ఇఫ్టూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పర్వత కోటేష్, హెచ్.లింగన్న, ఎమ్డీ. జబ్బార్, లక్ష్మయ్య, ఎస్కే. బాబన్న, కృష్ణ, సామ పాపయ్య, యాకన్న, కవిత, వేణు, ఏకాంబరం, శ్రీను, కల్పన, అనిత, వెంకటమ్మ, రాజు, శంకర్, రాంమూర్తి, లింగన్న, వెంకటమ్మ పాల్గొన్నారు. కంబాలప ల్లిలో నిర్వహించిన వేడుకల్లో ఎస్కే. బాబన్న జబ్బార్, శ్రీరాములు, ప్రసాద్, కట్ల నాగరాజు, యుగంధర్, నాగరాజు, ఉప్పలయ్య, సత్యం పాల్గొన్నారు.
- మునిసిపల్ కార్యాలయం వద్ద బీఆర్ఎస్ అను బంధ బీఆర్‌టీయూ ఆధ్వర్యంలో అంతర్జాతీయ కార్మిక దినోత్సవాన్ని నిర్వహించారు. బీఆర్ టీయూ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్ర మంలో ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రె డ్డి, ఫ్లోర్‌లీడర్ చిట్యాల జనార్ధన్,ఎడ్ల వేణుమా ధవ్, మంగలంపల్లి కన్న, మడత వెంకన్న. మంగలంపల్లి రాజ్‌కుమార్, కర్పూరపు గోపి పాల్గొన్నారు.
- మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా మాస్‌లైన్ ఆధ్వర్యంలో మేడే వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో సంయుక్త మండలాల సహాయ కార్య దర్శి పైండ్ల యాకయ్య, ప్రగతిశీల అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బండపల్లి వెంకటేశ్వర్లు, సురేష్, వెంకన్న, యాకయ్య, సతీష్, రాజు, రమేష్, భాషా పాల్గొన్నారు.

గుడుంబా రహితంగా తీర్చిదిద్దుతాం

వరంగల్ ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ నాగేందర్ రావు



అమర్‌సింగ్ తండాలో బెల్లం పానకాన్ని స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్ పోలీసులు

తొర్రూరు రూరల్, మే 1 : తొర్రూరు ప్రాంతాన్ని గుడుంబా రహితంగా తీ ర్చిదిద్దమే లక్ష్యంగా పని చేస్తున్నామని వరంగల్ ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ నాగేందర్ రావు అన్నారు. బుధవారం అమర్‌సింగ్‌తండా, భీముడితండా, దు బ్బతండా, కాశీగూడెం, హరిపిరాల ప్రాంతాల్లో అక్రమంగా గుడుంబా తయా రు చేస్తున్న స్థావరాలపై ఆకస్మికంగా ఎన్నికల వ్యయ పరిశీలకుడు ఎ.దిలీబా న్ సమక్షంలో తొర్రూరు ఎక్సైజ్ ఇన్‌చార్జి సీఐ ప్రవీణ్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుడుంబా తయారు చేస్తున్న బట్టీలపై దాడులు చేసి 6,800 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసి, 40లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఎన్నికల కోడ్ అమ లులోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకు 858 లీటర్ల సారాను, 1,550 కేజీల నల్లబెల్లం స్వాధీనం చేసుకొని 52,350 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశా మని, అక్రమంగా రవాణా చేస్తున్న 15 వాహనాలను సీజ్ చేసినట్లు తెలి పారు. కాగా, తొర్రూరులోని పలు కిరాణా షాపుల్లో అక్రమంగా విక్రయిస్తున్న ఈస్ట్ పౌడర్‌ను స్వాధీనం చేసుకొని కిరాణ మర్చంట్ వారికి కౌన్సెల్ ఇచ్చా మని సీఐ ప్రవీణ్ వెల్లడించారు. గుడుంబా నియంత్రణే లక్ష్యంగా పని చేస్తు న్నామని, ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నాటి నుంచి రోజువారి కార్యక్ర మాలను ఎన్నికల పరిశీలకులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలి పారు. కార్యక్రమంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఈఎస్ శ్రీనివాస్ రెడ్డి, సీఐ నాగేశ్వర్ రావు, ఎస్సై తిరుపతి, ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎక్సైజ్ అధికారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే మహిళలకు సంక్షేమ పథకాలు

పార్టీ ఎంపీ అభ్యర్థి పోరిక బలరాంనాయక్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి బలరాంనాయక్

చెన్నారావుపేట (వరంగల్ జిల్లా), మే 1 : కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోనికి వస్తేనే.. నిరుపేద మహిళలకు సంక్షేమ పథకాలు అందుతా యని మహబూబాబాద్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి పోరిక బలరాంనాయక్ అన్నారు. బుధ వారం చెన్నారావుపేట మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భుక్య గోపాల్‌నాయక్ అధ్యక్షతన మహబూబాబాద్ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశంలో ఎమ్మెల్యే దొంతి మాధవరె డ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో రాహుల్‌గాంధీ ప్రధాన మంత్రి కావటం ఖాయమన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోనికి రాగానే నిరుపేద మహిళలకు ఏడాదికి రూ.లక్ష అందిస్తామన్నారు. బడుగు, బలహీన వర్గాలకు కాంగ్రెస్ పార్టీ ప్రకటిం చిన ఐదు గ్యారెంటీ పథకాలను అందిస్తామ న్నారు. బీసీ కార్పొరేషన్ ద్వారా బీసీలకు న్యాయం చేస్తామన్నారు. బీజేపీ ప్రభుత్వం గత 10 సంవత్స రాల్లో పేదలకు చేసిందేమి లేదన్నారు. ఈ ఎన్ని కల్లో బీజేపీకి తగిన గుణపాఠంను చెప్పాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మాట్లా డుతూ రాష్ట్రప్రభుత్వం అందించే సంక్షేమ పథకా లను పార్టీలకతీతంగా ఇచ్చే బాధ్యత తనదేన న్నారు. ఉపాధిహామీ పథకంలో రోజుకు ప్రతీ కూలీకి రూ.400లను అందిస్తామన్నారు. కార్యక ర్తలు బలరాంనాయక్‌ను 70వేల ఓట్ల మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి అనిల్‌రావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికారి ప్రతినిధి తక్కళ్లపెల్లి రవిందర్ రావు, పీసీసీ సభ్యుడు రంజిత్‌రెడ్డి, పాల్వాయి శ్రీను వాస్, పెండం రామానంద్, దేవేందర్‌రావు, మోహ న్‌లాల్. సంగులాల్, జిల్లా కార్యదర్శి మొగిలి వెంక ట్‌రెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్‌లు సిద్దెన రమేష్, తప్పెట రమేష్, నెక్కొండ బ్లాక్ కార్యదర్శి మంద యాకయ్యగౌడ్, నర్సంపేట మండల ఉపా ధ్యాక్షుడు గజ్జి రాజు, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ కత్తి కిరణ్, జిల్లా మహిళ అధ్యక్షురాలు కర్నాటి పార్వతమ్మ పాల్గొన్నారు.

బలరాంనాయక్‌ను అధిక మెజారిటీతో గెలిపించాలి

మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్



లాలుతండాలో ఉపాధిహామీ కూలీలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్

నెల్లికుదురు, మే 1 : కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి పోరిక బలరాంనాయక్‌ను అధిక మెజారిటీతో గెలిపించాలని మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ పిలుపునిచ్చారు. నెల్లికు దురులో బుధవారం ముఖ్యకార్యకర్తల సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో కార్యకర్తలు ఇంటిం టి ప్రచారం నిర్వహించాలన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో కార్యకర్తలు కష్టపడి పనిచేశారని, అదే స్ఫూర్తితో పార్లమెంట్ ఎన్నికల్లో పనిచే యాలన్నారు. నియోజక వర్గంలో 50 వేల మె జారిటీ వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఉపాధి కూలీలకు వేతనం రూ.400 చెల్లిస్తామన్నారు. యువన్యాయం, నారిన్యాయం రైతున్యాయం, శ్రామికన్యాయం, సామాజిక న్యాయం వంటి పథకాలను ప్రజలకు తెలియజే యాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు భరత్ చంద్రారెడ్డి మండల అధ్యక్షుడు గొల్లపెల్లి ప్రభాకర్, బ్లాక్ కాం గ్రెస్ అధ్యక్షుడు ఎదళ్ల యాదవ రెడ్డి, హెచ్.వెంకటేశ్వర్లు, నాయిని సత్యపాల్‌రెడ్డి, కాసం లక్ష్మారెడ్డి, వలబోజు వెంకటేశ్వర్లు, భైరు అశోక్‌గౌడ్, జెల్ల వెంకటేష్, కార్య కర్తలు పాల్గొన్నారు.

- ఇనుగుర్తి : పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి పోరిక బలరాంనాయక్‌ను భారీ మెజా ర్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే మురళీనాయక్ కోరారు. లాలుతండాలోని ఉపాధి హామీ కూలీతో మాట్లాడారు. ప్రతీ ఒక్కరు కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి, అత్యధిక మెజార్టీతో బలరాంనాయక్‌ను గెలిపించాలని కోరారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ ప్రజల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టనుందని చెప్పారు.

పేదల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ ధ్యేయ మని పేర్కొన్నారు. రాహుల్‌గాంధీ ప్రధాని కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. తర్వాత మేడే ఉత్సవాల్లో భాగంగా ఇనుగుర్తిలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్‌చందర్‌రెడ్డి, పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గెలుపును ఎవరూ ఆపలేరు

ప్రభుత్వ విప్, ఎమెల్యే జాటోత్ రాంచంద్రునాయక్



నర్సింహులపేటలో మాట్లాడుతున్న జాటోత్ రాంచంద్రునాయక్

నర్సింహులపేట, మే 1 : పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలు పును ఎవరూ ఆపలేరని డోర్నకల్ ఎమ్మెల్యే ప్రభుత్వవిప్ జాటోతు రాంచంద్రునాయక్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం పడమటిగూడెం, కొమ్ము లవంచ, రూప్లతండా, జయపురం, బొజ్జన్నపేట, కౌసల్యదేవిపల్లి, రామన్నగూడెం, ముంగిమడుగు, నర్సిం హపురంబంజర, నర్సింహులపేట, లోక్యతండా, వంతడు పల, పెద్దనాగారం స్టేజీ, పెద్దనాగారం, గోపతండా, జగ్గు తండా, వస్రాంతండాల్లో ప్రచారం నిర్వహించారు. అనం తరం ముఖ్యకార్యకర్తలతో సమావేశమయ్యారు. కాంగ్రెస్ అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీలను ప్రజలకు వివరించా లన్నారు. రాజ్యాంగాన్ని సవరించేందుకు కుట్రతో ఉన్న బీజేపీకి తెలంగాణ రాష్ట్రంలో ఓటు అడిగే అర్హతలేద న్నారు. ఎంపీగా బలరాంనాయక్ గెలుపుకోసం కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు జినుకల రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి బొబ్బ సోమిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు ఇర్రె లింగారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్య క్షుడు రాజశేఖర్, జిల్లా నాయకులు తోట సురేష్, రవీందర్ రెడ్డి, రజనీకాంత్‌రెడ్డి, ఎస్టీ సెల్ అధ్యక్షుడు దస్రూనాయక్, అన్ని గ్రామాల అధ్యక్షులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

నా చావుకు సీఐ, ఎస్ఐ కారణం


అదృశ్యమైన ప్రశాంత్

- సూసైడ్ నోట్ రాసి అదృశ్యమైన వ్యక్తి
- నా భర్తను కాపాడండి : బాధితుడి భార్య

వరంగల్ క్రైం, మే1: తన చావుకు హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్ సీఐ జె.సురేష్, ఎస్ఐ ఎం.సురేష్‌తోపాటు మరో ఐదుగురు కానిస్టేబుళ్లు కారణమని ఆరోపిస్తూ వంగపహాడ్ గ్రామానికి చెందిన ప్రశాంత్ అనే వ్యక్తి సూసైడ్ నోట్ రాసి అదృశ్యమవడం కలకలం రేపింది. గ్రామంలో తనకు వీరేశం అనే వ్యక్తి డబ్బులు ఇవ్వాల్సి ఉండగా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వెళితే పోలీసులు విచక్షణారహితంగా కొట్టారని సూసైడ్ నోట్‌లో పేర్కొన్నారు. పోలీసుల వేధింపులు భరించలేక ఆత్మహత్య చేసుకుంటున్నానని పేర్కొంటూ ప్రశాంత్ మంగళవారం అదృశ్యమయ్యాడు. అయితే తన భర్తను కాపాడి పోలీసులపై చర్య తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తూ బాధితుడి భార్య మాధవి పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసింది. సహాయం కోసం వెళితే హసన్‌పర్తి సీఐ, ఎస్ఐలు కొట్టడం వల్లనే అవమానం భరించలేక తన భర్త సూసైడ్ నోట్ రాసి ఎటో వెళ్లిపోయాడని ఆమె విలపించారు. తన భర్తకు ఏదైనా జరిగితే దానికి సీఐ, ఎస్ఐ బాధ్యత వహించాలని ఆమె తెలిపారు. కాగా, డయల్ 100ను దుర్వినియోగం చేశాడని సోమవారం హసన్‌పర్తి పోలీసులు ప్రశాంత్‌ను తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసిన విషయం తెలిసిందే. అదేరోజు సాయంత్రం నుంచి ప్రశాంత్ అదృశ్యమైనట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

సమాజ సమస్యలపై వ్యాసరచనలు చేపట్టాలి

సుబేదారి, మే 1: సమాజం ఎదుర్కొంటున్న సమస్యలపై వ్యాసరచనలు చేపట్టాలని కేయూ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ తాటికొండ రమేష్ అన్నారు. సుబేదారిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల జర్నలిజం విభాగం అధ్యాపకుడు డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి వ్యవసాయ, విద్య, వైద్య సామాజిక రంగాలపై రాసిన వివిధ పత్రికల్లో ప్రచురితమైన వ్యాసాల సంపుటి పుస్తకాన్ని రూపొందించారు. ఈ పుస్తకాన్ని బుధవారం ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ రమేష్ మాట్లాడుతూ.. సామాజిక శాస్త్రాల అధ్యాపకులకు సమాజంపై పూర్తి అవగాహన ఉండాలని అన్నారు.

కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రమేష్, సీనియర్ అధ్యాపకులు అంజనారావు, డాక్టర్లు కరుణాకర్, శ్రీధర్‌కుమార్, శేషు, శ్రీలత, మాధవి, రాంబాబు, సుచరిత, నాగయ్య, భిక్షపతితోపాటు రచయిత ఆదిరెడ్డి పాల్గొన్నారు.

10 జీపీఏ సాధించిన వారికి మోషన్ కళాశాలలో ఉచిత విద్య

వరంగల్ ఎడ్యుకేషన్, మే 1: పదో తరగతిలో 10 జీపీఏ సాధించిన విద్యార్థులకు హనుమకొండ నయీంనగర్‌లోని రాజస్థాన్ కోట మోషన్ జూనియర్ కళాశాలలో రెండేళ్ల ఫ్రీ ఎడ్యుకేషన్ అందిస్తున్నట్లు కళాశాల చైర్మన్ వడ్లకొండ వేణుగోపాల్ పేర్కొన్నారు. ఐఐటీ, నీట్‌లకు విద్యను పూర్తిగా ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. అలాగే 9.8 జీపీఏ సాధించిన విద్యార్థులకు ఐఐటీ, నీట్‌తో పాటు కళాశాల ఫీజులో 50 శాతం రాయితీని ఇస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఐఐటీ, మెడికల్‌లో సీట్లు సాధించడమే లక్ష్యంగా నెలకొల్పిన రాజస్థాన్ కోట మోషన్ జూనియర్ కళాశాల యాజమాన్యం ప్రతిభ కలిగిన ఉత్తమ విద్యార్థులను గుర్తించి ఉచితంగా విద్యను అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. మిగతా అన్ని వివరాలకు నయీంనగర్‌లోని మోషన్ జూనియర్ కళాశాలలో సంప్రదించాలని ఆయన కోరారు.

మహిళ ఖాతా నుంచి డబ్బులు మాయం

హనుమకొండ టౌన్, మే1: మహిళ బ్యాంక్ ఖాతా నుంచి ఆమెకు తెలియకుండానే వేరే ఖాతాలోకి డబ్బులు బదిలీ అయ్యాయి. హనుమకొండ కిషన్‌పురలో నివాసం ఉంటున్న రజిని అనే మహిళ ఏప్రిల్ 26న ఉదయం బ్యాలెన్స్ చెక్ చేసుకోగా రూ.30,000 డ్రా చేసినట్లుగా చూపించింది. వెంటనే సంబంధిత బ్యాంకు మేనేజర్‌ను ఫోన్‌లో సంప్రదించగా సత్యం ఎంటర్‌ప్రైజెస్‌కు ట్రాన్స్‌ఫర్ అయినట్లుగా సమాచారం ఇచ్చాడు. కాగా, బాధితురాలు బుధవారం హనుమకొండ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు పోలీసులు పేర్కొనారు.

కాజీపేటలో పోలీసుల తనిఖీలో రూ.3.41 లక్షలు పట్టివేత

కాజీపేట, మే 1: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో పోలీసుల వాహనాలు తనిఖీ చేస్తుండగా తనిఖీలలో ఇద్దరు వ్యక్తులు సరైనపత్రాలు లేకుండా తరలిస్తున్న నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కాజీపేట ఇన్‌స్పెక్టర్ వై. సుధాకర్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కాజీపేట డీజిల్‌కాలనీ చెక్‌పోస్ట్ వద్ద బుధవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా వరంగల్ జిల్లా గీసుకొండ మండలం ధర్మారం గ్రామానికి చెందిన లక్కాకుల సురేశ్ సరియైన పత్రాలు లేకుండా బైక్‌లో రూ.2,71,060 తరిలిస్తున్నారు. ఇదిలా ఉండగా, ఇదే చెక్‌పోస్ట్ వద్ద వరంగల్‌కు చెందిన మిట్టపల్లి రాకేశ్, సరైన పత్రాలు లేకుండా తన బైక్‌లో రూ.70వేల 800 తరలిస్తుండగా పట్టుపడ్డారు. నగదు స్వాధీనం చేసుకుని అధికారులకు అప్పగించినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

అరూరికి ఓటమి భయం

అందుకే చిల్లర మాటలు మాట్లాడుతున్నాడు ● ఎర్రబెల్లి, అరూరిని మడతబెట్టిన నియోజకవర్గాల ప్రజలు : ఎమ్మెల్యే కడియం శ్రీహరి

వర్ధన్నపేట రూరల్, మే 1 : వరంగల్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్‌కు ఓటమి భయం పట్టుకుందని, అందుకే చిల్లర మాటలు మాట్లాడుతున్నాడని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి వ్యాఖ్యానించారు. బుధవారం వర్ధన్నపేట పట్టణంలోని ఏబీఎస్ ఫంక్షన్ హాల్‌లో ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అధ్యక్షతన ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ బూత్ స్థాయి కమిటీల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బూత్ కమిటీలే పార్టీకి పునాదులని, రానున్న రోజుల్లో కార్యకర్తలు కష్టపడి పని చేయాలన్నారు. బీజేపీతో పదేండ్లుగా ప్రజలకు ఎలాంటి న్యాయం జరగలేదని, అన్ని రంగాల్లో విధ్వంసం జరిగిందని ఆరోపించారు. కడియం కావ్య నియోజకవర్గ పరిధిలోని పర్వతగిరి గ్రామంలోనే పుట్టి పెరిగిందని, చదువుకుని మళ్లీ వర్ధన్నపేట ప్రభుత్వ ఆస్పత్రిలోనే వైద్యురాలిగా పనిచేసిందని గుర్తుచేశారు. ఈ ప్రాంత ప్రజల కష్టసుఖాలు తెలిసిన కావ్యను గెలిపించి ఆశీర్వదించాలని కోరారు.

పార్లమెంటు అభివృద్ధిని మరిచి వ్యక్తిగత విమర్శలు చేస్తున్న అరూరికి ప్రజలే గుణపాఠం చెబుతారని తెలిపారు. వంద శాతం కడియం కావ్య లోకలేనని స్పష్టం చేశారు. రైతుల భూములు లాక్కొని రియల్ ఎస్టేట్ వాళ్లతో కలిసి ఫెన్సింగ్‌లు వేసిన ఘనత రమేష్‌దని గుర్తు చేశారు. వర్ధన్నపేట ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే అరూరి రమేష్ మండలానికో గెస్ట్ హౌస్ నిర్మించుకున్నాడని ఆరోపించారు. అసెంబ్లీ ఎన్నికల్లో పాలకుర్తిలో ఎర్రబెల్లి దయాకర్‌రావును, వర్ధన్నపేటలో అరూరి రమేష్‌ను ప్రజలు మడతపెట్టి కొడితే దిమ్మ తిరిగి పోయిందని ఎద్దేవా చేశారు. మనుమరాలు వయసున్న అమ్మాయి చేతిలో ఓడిపోయిన ఎర్రబెల్లి ఇంకా సిగ్గులేకుండా నియోజకవర్గంలో తిరుగుతూ ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అద్భుతమైన మేనిఫెస్టోను తీసుకువచ్చిందని, కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే పేద మహిళలకు రూ.లక్ష అందించడం ఖాయమన్నారు. కిసాన్ న్యాయ్ పేరుతో రైతులను ఆదుకుంటామని, పంటలకు కనీస మద్దతు ధర చట్టం తీసుకువస్తామని హామీ ఇచ్చారు.

అరూరి అకృత్యాలు అన్నీ ఇన్నీ కావు : కడియం కావ్య

వర్ధన్నపేట ఎమ్మెల్యేగా ఉండి అరూరి రమేష్ చేసిన అకృత్యాలు అన్నీ ఇన్నీ కావని వరంగల్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య విమర్శించారు. అరూరి రమేష్ చేసిన అవినీతి, అక్రమాలు, అకృత్యాలు, భూకబ్జాలు ప్రజలందరికీ తెలుసని, మళ్లీ ఓట్ల కోసం వస్తున్న రమేష్‌కు తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. బీజేపీ రైతుల సంక్షేమాన్ని మరిచి కార్పొరేట్ సంస్థల కోసం పనిచేస్తోందని ఆరోపించారు. బీజేపీకి ధన బలముంటే, కాంగ్రెస్ పార్టీకి ప్రజాబలం ఉందన్నారు. తన అవినీతిని కప్పిపుచ్చుకోవడానికే అరూరి రమేష్ బీజేపీ పంచన చేరాడని తెలిపారు. వర్ధన్నపేట ప్రభుత్వ ఆస్పత్రిలో వసతులు లేక ఇబ్బందులు పడుతున్నా, ఏనాడూ ఎమ్మెల్యేగా ఉండి పట్టించుకోలేదని ఆరోపించారు. కరోనా క్లిష్టకాలంలో సైతం ఇక్కడి ప్రజలకు తాను సేవ చేశానని, మీరు ఆశీర్వదిస్తే వర్ధన్నపేట నియోజకవర్గాన్ని అన్ని రకాలుగా అభివృద్ధిలో ముందుకు తీసుకువెళ్తానని హామీ ఇచ్చారు. రాహుల్ గాంధీని ప్రధానిగా చేస్తే ప్రజలకు మేలు జరుగుతుందని స్పష్టం చేశారు.

అనంతరం వర్ధన్నపేట పట్టణానికి చెందిన వంద మంది బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ నేత కత్తి వెంకటస్వామి, డీసీసీబీ ఛైర్మన్ మార్నేని రవీందర్‌రావు, మునిసిపల్ ఛైర్‌పర్సన్ ఆంగోతు అరుణ, మాజీ జడ్పీటీసీ పాలకుర్తి సారంగపాణి, మండల పార్టీ అధ్యక్షుడు ఎద్దు సత్యనారాయణ, మండల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కావ్యకు పలువురి మద్దతు

హనుమకొండ సిటీ/వడ్డేపల్లి: వరంగల్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టరు కడియం కావ్యకు తెలంగాణ మైనారిటీ సంక్షేమ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ అఖిల్ పాషా మద్దతు తెలియచేశారు. బుధవారం హనుమకొండలోని కడియం కావ్య నివాసంలో సమాఖ్య ప్రతినిధులు కలిసి పుష్పగుచ్ఛం అందచేశారు. ఈ కార్యక్రమంలో మహ్మద్ మజహార్ హుస్సేన్, మహ్మద్ ఆబిద్ నవాజ్, నూర్జహాన్ బేగం తదితరులు పాల్గొన్నారు.

అలాగే కడియం కావ్యకు సంపూర్ణ మద్దతును తెలుపుతున్నట్లు తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల జేఏసీ ఛైర్మన్ చెరుకు రాంచందర్ పేర్కొన్నారు. బుధవారం బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయనతో పాటు రాష్ట్ర కన్వీనర్ నల్లాల కనకరాజు, వైస్ ఛైర్మన్లు అనిల్, నాను మాట్లాడారు. ఈ సమావేశంలో జంగం బాబురావు, రాజకొమురయ్య, ఐలయ్య, సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.





సమావేశంలో మాట్లాడుతున్న అభ్యర్థి కడియం కావ్య, పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు




ఇండోర్ స్టేడియంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న లోక్ సభ కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య, కడియం శ్రీహరి

జేఎన్ఎస్‌లో కావ్య ఎన్నికల ప్రచారం

హనుమకొండ చౌరస్తా, మే 1: వరంగల్ లోక్‌సభ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కడియం కావ్య హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ ఇండోర్, ఔట్ డోర్ స్టేడియంలో మార్నింగ్ వాకర్స్‌తో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బుధవారం స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డితో కలసి హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో మార్నింగ్ వాకింగ్ పాల్గొని వాకర్స్‌ను కలసి ముచ్చటిస్తూ చెయ్యి గుర్తుకు ఓటు వేసి తనని భారీ మెజారిటీతో గెలిపించాలని ఓట్లను అభ్యర్థించారు.

ఈ సందర్భంగా కావ్య మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అంటేనే అభివృద్ధి, సంక్షేమానికి మారు పేరు అని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్రంలో ప్రజాపాలన అందుబాటులోకి వచ్చిందని కొనియాడారు. కేంద్రంలో రాహుల్ గాంధీ సారథ్యంలో దేశ ప్రజలకు మంచి పాలన అందనుందని తెలిపారు. నిత్యం ప్రజల మధ్యలో అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానన్నారు. చెయ్యి గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని వాకర్స్‌ను కోరారు. ప్రచారంలో భాగంగా సరదాగా క్రీడాకారులతో కలిసి ఇండోర్ స్టేడియంలో బ్యాడ్మింటన్ ఆడి ఆకట్టుకున్నారు. అంతకుముందు బాలసముద్రంలోని కూరగాయల మార్కెట్‌లో ఎన్నికల ప్రచారంలో కావ్య పాల్గొని కాంగ్రెస్ పార్టీ చెయ్యి గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఈ మేరకు మార్కెట్‌లో ఉన్న వ్యాపారులు కావ్యకు మద్దతూ ప్రకటిస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.





ఉక్కిరిబిక్కిరి

ఎండల తీవ్రత, ఉక్కపోతతో జనం విలవిల

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 45.6డిగ్రీల సగటు ఉష్ణోగ్రత

హనుమకొండ (ఆంధ్రజ్యోతి) / ములుగు/ భూపాలపల్లి టౌన్/ జనగామ కల్చరల్ / మహబూబాబాద్ రూరల్, మే 1 (ఆంధ్రజ్యోతి) :ఎండల తీవ్రత మరింత పెరిగింది. ఎండతీవ్రతకు తోడు వడగాలులు, ఉక్కపోతకు జనం విలవిలలాడుతున్నారు. ఈ క్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో అత్యధిక పగటి ఉష్ణోగ్రత 45.6 డిగ్రీల సగటు ఉష్ణోగ్రత నమోదైంది. బుధవారం ములుగు జిల్లాలో అత్యధికంగా 45.6 డిగ్రీల రికార్డు స్థాయి ఉష్ణోగ్రత నమోదవగా వరంగల్‌లో 45.4 డిగ్రీలు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 45.3 డిగ్రీలు, జనగామలో 45.3 డిగ్రీలు, మహబూబాబాద్‌లో 45.1 డిగ్రీలు, హనుమకొండలో 44.6 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాష్ట్రంలోని 15 జిల్లాల్లో 45 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవగా వీటిలో అయిదు జిల్లాలు ఉమ్మడి వరంగల్ పరిధిలోనే ఉన్నాయి. ఉష్ణోగ్రతలు అంతకంతకు పెరుగుతుండడంతో వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేయగా.. ఈ అయిదు జిల్లాలు ఆ జాబితాలో ఉన్నాయి. అయితే ఉమ్మడి వరంగల్ జిల్లాల్లో 45డిగ్రీలు దాటి ఎండల తీవ్రత ఉండడం వందేళ్లలో ఇదే మొదటి సారి అని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. 1921లో ఈ స్థాయిలో ఎండలు రికార్డు అయ్యాయని, ఆ తర్వాత ఏప్రిల్ నెలలో 45 డిగ్రీలు దాటి ఉష్ణోగ్రతలు నమోదవలేదని, సాధారణంగా ఏప్రిల్‌లో 40 నుంచి 41డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు నమోదు అవుతుంటాయని, ఈ సారి మాత్రం ఇందుకు భిన్నంగా ఏప్రిల్ మొదటి వారం నుంచె ఎండలు 41 డిగ్రీలు దాటాయని చెబుతున్నారు.

ఉడికిపోతున్న ఏజెన్సీ మండలాలు

వేసవి తీవ్రతతో ములుగు జిల్లాలోని ఏజెన్సీ మండలాలు ఉడికిపోతున్నాయి. కొద్దిరోజులుగా 45డిగ్రీలకు పైబడి ఉష్ణోగ్రతలు నమోదవుతుండగా బుధవారం ఏకంగా 46డిగ్రీలు దాటింది. మంగపేట మండలం మల్లూరులో 46.5, వెంకటాపురం(నూగూరు) మండలం ఆలుబాకలో 46డిగ్రీల రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని అధికారులు తెలిపారు. అలాగే తాడ్వాయి మండలం మేడారంలో 44.4, వాజేడు మండలం ధర్మవరంలో 44.3, వెంకటాపూర్(రామప్ప)లో 44.2, ములుగు మండలం ఖాసిందేవిపేటలో 44, ఏటూరునాగారంలో 43.8, గోవిందరావుపేటలో 43.5, కన్నాయిగూడెంలో 42.3డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయింది. అలాగే జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఆరంజ్ జోన్ నుంచి రెడ్ జోన్‌లోకి వచ్చింది. నిన్న మొన్నటి వరకు 43 డిగ్రీల ఉష్ణోగ్రత ఉన్న మండలాల్లో బుధవారం 45 డిగ్రీలు దాటింది. చిట్యాల మండల కేంద్రంలో 45.5డిగ్రీలు, మల్హర్ మండలంలోని తాడిచర్లలో 45.3, రేగొండ మండలంలోని గోరికొత్తపల్లిలో 45.3, అలాగే గణపురంలోని చెల్పూరులో 45.1 డిగ్రీలు, మొగుళ్లపల్లిలో 44.8 డిగ్రీలు నమోదవగా మిగిలిన మండలాల్లోనూ 45 నుంచి 42డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మరో వైపు జనగామ కూడా రెడ్‌జోన్‌లోకి వెళ్లింది. బుధవారం గరిష్ఠంగా 45.6డిగ్రీల సగటు ఉష్ణోగ్రత నమోదైంది. చిలుపూర్, జఫర్‌గడ్ మండలాల్లో 45.6, జనగామలో 45.0 డిగ్రీలు నమోదైంది.



మండే ఎండ.. పచ్చి గడ్డే అండ

ఎండలు మండుతున్నాయి... రోజురోజుకు ఉష్ణోగ్రతలు అధికమవుతున్నాయి. బయటకు రావాలంటేనే జనం బెంబెలెత్తుతున్నారు. ఇక ఇళ్లలో ఉండే వారు ఉక్కపోతకు అల్లాడుతున్నారు. ముఖ్యంగా రేకుల ఇళ్లలో నివాసం ఉండే వారి పరిస్థితి మరింత దారుణంగా ఉంది. ఈ క్రమంలో హనుమకొండ న్యూశాయంపేట వద్ద రేకుల షెడ్డులో నివాసం ఉంటున్న ఓ కుటుంబం భానుడి ప్రతాపం నుంచి కొంత ఉపశమనం పొందేందుకు ఇలా వారు నివాసం ఉంటున్న రేకుల కప్పుపై పచ్చని జమ్మి గడ్డిని వేసుకున్నారు.

ఫోటో : 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటోగ్రాఫర్, వరంగల్

వడదెబ్బతో ముగ్గురి మృతి

వడదెబ్బ బారిన పడి ఓ వృద్ధుడు మృతి చెందిన ఘటన మహబూబాబాద్ మండలం ముడుపుగల్‌లో బుధవారం జరిగింది. గ్రామానికి చెందిన మేరుగు నారాయణ (75) ఎండతీవ్రత, వడగాలుకు అనారోగ్యం పాలై.. బుధవారం పరిస్థితి విషమించి ఇంటివద్దే మృతిచెందాడు. జనగామ జిల్లా కేంద్రంలోని గుండ్లగడ్డకు చెందిన మహ్మద్ మొయినొద్దీన్ (52) అనే కూలీ రోజూలాగే బుధవారం కూడా పనికి వెళ్లి తిరిగి ఇంటికి వచ్చి కుప్పకూలిపోయాడు. జిల్లా ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడు. అలాగే కమలాపూర్ మండలంలోని గూడూరు గ్రామానికి చెం దిన పత్తిపాక రమేష్(48) అనే చిరువ్యాపారి రోజూలాగే దుస్తులు అమ్మి మంగళవారం అస్వస్థతకు గురవగా ఆసుపత్రికి తరలించారు. కానీ ఆయన అప్పటికే మృతిచెందాడు.



లోక్‌సభ ఎన్నికల్లో ఆశీర్వదించండి..

- దళితులను ముట్టుకోని వ్యక్తి కడియం కావ్య
- పదవులు అనుభవించి కేసీఆర్‌కు కడియం వెన్నుపోటు
- వరంగల్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్
- ఏనుగల్లు, పర్వతగిరిలో కార్నర్ మీటింగ్‌లు

పర్వతగిరి, మే 1: లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తున్న తనను ఆశీర్వదించాలని వరంగల్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్ ప్రజలను కోరారు. బుధవారం మండలంలోని ఏనుగల్లు, పర్వతగిరిలో బీజేపీ ఆధ్వర్యంలో కార్నర్ మీటింగ్‌లను నిర్వహించారు. ఆయా గ్రామాల్లో నిర్వహించిన ర్యాలీలకు పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. జై బీజేపీ.. జై అరూరి.. నినాదాలతో గ్రామాలు మార్మోగాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వర్ధన్నపేట నియోజకవర్గ ప్రజలు తనను రెండుసార్లు ఎమ్మెల్యేగా ఆశీర్వదించారని, ప్రస్తుతం మీ ఇంటి బిడ్డగా పార్లమెంట్ సభ్యుడిగా ఆశీర్వదించాలని కోరారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితుడినై తాను బీజేపీలో చేరానని, తనతో పాటు అనేక మంది మూడోసారి కేంద్రంలో బీజేపీ అధికారంలోకి రావాలని కోరుకుంటున్నారని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో తనను ఓడించడానికి ఎన్ని కుట్రలు చేశారో ప్రజలకు తెలుసని, ప్రస్తుతం ఆ కుట్రలను పటాపంచలు చేయాలన్నారు. తనను ఓడించడం కోసం కడియం శ్రీహరి అనేక ప్రయత్నాలు చేశాడని, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు ప్రజలకు కన్నీళ్లు మిగిల్చాయన్నారు. హామీలు అమలు చేసే ఆలోచన కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదని, కాంగ్రెస్ పార్టీ నేతలు వచ్చి కల్లబొల్లి మాటలు చెప్పి ఓట్లడుగుతారని, వారి మాటలను నమ్మి మోసపోవద్దని హితవు పలికారు.

కడియం శ్రీహరి కుమార్తె కావ్యకు రేవంత్‌రెడ్డి ఎందుకు టికెట్ ఇచ్చాడో కాంగ్రెస్ నేతలు ఆలోచన చేయాలని అరూరి రమేష్ కోరారు. కాంగ్రెస్‌లో కష్టపడ్డ దళితులు లేరా అని ప్రశ్నించారు. 50 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి శూన్యమని, కాంగ్రెస్ పార్టీ నేతల మీద లేని స్కాంలు లేవన్నారు. వర్ధన్నపేట ఆస్పత్రిలో కడియం కావ్య డాక్టర్‌గా పని చేసిందని, ఆస్పత్రిలో వైద్యం కోసం వచ్చిన దళితులను కనీసం ముట్టుకుని వైద్యం చేయలేదని విమర్శించారు. ఊసరవెల్లిలాగా రంగులు మార్చే వ్యక్తి కడియం శ్రీహరి అని, పదవులు అనుభవించి కేసీఆర్‌కు వెన్నుపోటు పొడిచారని ఆరోపించారు. తాటికొండ రాజయ్య, పసునూరి దయాకర్‌తో పాటు తనను సైతం బీఆర్ఎస్ పార్టీ నుంచి వెళ్లగొట్టింది కడియం శ్రీహరి అని ఆరోపించారు. పదేళ్లు వర్ధన్నపేటకు ఎమ్మెల్యేగా ఉండి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేశానని, అవి మీ కళ్ల ముందే ఉన్నాయని తెలిపారు. మోదీ నేతృత్వంలో దేశం అభివృద్ధి చెందుతోందని, అభివృద్ధి చేసే బీజేపీకే ఓటు వేసి మళ్లీ పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. మే 13వ తేదీన అందరూ కమలం పువ్వు గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఆయన కోరారు.


ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు, కొండేటి శ్రీధర్, వరంగల్ తూర్పు బీజేపీ ఇన్‌చార్జ్ ఎర్ర బెల్లి ప్రదీప్‌రావు, జడ్పీ వైస్ ఛైర్మన్ గజ్జెల శ్రీరాములు, కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు తిరుపతిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు కుడికాల శ్రీధర్, జిల్లా నాయకులు గాడిపెల్లి రాజేశ్వర్‌రావు, బన్న ప్రభాకర్, మండల అధ్యక్షుడు జాటోత్ శ్రీనివాస్ నాయక్, నాయకులు ఏకాంతం గౌడ్, నరేందర్ వర్మ, రంగు కుమార్ గౌడ్, రంగు రజిత, లక్ష్మీనారాయణ, బొట్ల మధు తదితరులు పాల్గొన్నారు.



పర్వతగిరిలో దివ్యాంగురాలితో మాట్లాడుతున్న అరూరి రమేష్



ఏనుగల్లులో ర్యాలీలో పాల్గొన్న ప్రజలు



బీఆర్ఎస్, కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి

స్టేషన్‌ఘన్‌పూర్, మే 1 : మాదిగలకు ద్రోహం చేసిన బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు లోక్‌సభ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని, బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్‌కు మాదిగలు, మాదిగ ఉపకులాలు ఓటు వేసి గెలిపించాలని ఎంఎస్‌పీ జాతీయ నాయకుడు మంద కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం ఆయన స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. మాదిగల అండతో రాజకీయంగా ఎదిగిన కడియం శ్రీహరి.. మాదిగలను రాజకీయంగా అణగదొక్కుతూ వారి రాజకీయ భవిష్యత్తును సమాధి చేస్తున్నాడని అన్నారు. కడియంకు బుద్ధి చెప్పే సమయం ఆసన్నమైందని అన్నారు. బీజేపీ అధికారంలోకి వస్తేనే మాదిగలకు, మాదిగ ఉపకులాలకు మేలు జరుగుతుందన్నారు. బీజేపీ గెలిస్తే మాదిగల అనేక ఏళ్ల సమస్య పరిష్కారం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌పీ రాష్ట్ర నాయకుడు పుట్ట రవి, నియోజకవర్గ ఇన్‌చార్జి చాడ ఏలియా, నాయకులు గాదె శ్రీధర్, రడపాక ఆదాం, గాదెపాక మహేందర్, గంగాదర్, రవీందర్, గాదె కుమార్, మేడ యాకస్వామి, అశోక్, రాజశేఖర్ పాల్గొన్నారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మంద కుమార్

వేసవిలో ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి

● డీఎంహెచ్‌వో కళావతిబాయి

నెహ్రూసెంటర్, మే 1 : వేసవిలో ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి కళావతి బాయి బుధవారం సూచించారు. డైరెక్టర్ పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ ఆదేశాల మేరకు జిల్లాలో వైద్య, ఆరోగ్యశాఖ తరుపున ప్రజలు ఎండబారిన పడకుండా జాగ్రత్తలు తీసుకునే విధంగా ఎప్పటికప్పుడు రోజురోజుకు ఉష్ణోగ్రతలు 44 డిగ్రీల సెల్సియస్‌కు పెరిగే అవకాశం ఉన్నందున వేడిమినుంచి ఉపశమనం పొందేందుకు వైద్యుల సలహాలు, సూచనలు పాటించాలన్నారు. వడదెబ్బకు గురైనట్లయితే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు.

నాలుగు తులాల బంగారం అపహరణ

● పోలీసుల కేసు నమోదు

నెహ్రూసెంటర్, మే 1 : పట్టపగలే ఓ మహిళా మెడలో నుంచి నాలుగు తులాల బంగారం అపహరణ చేసిన ఘటన బుధవారం మహబూబాబాద్ జిల్లా కేంద్రం రైల్వేస్టేషన్ సమీపంలో చోటుచేసుకుంది. డోర్నకల్ జీఆర్పీ ఎస్సై సురేష్ తెలిపిన వివరాల ప్రకారం. గార్ల మండలం ముల్కనూరుకు చెందిన సోనబోయిన యశోద అనే మహిళ తన సమీప బంధువు జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా పరామర్శించి తిరిగి వెళ్లే క్రమంలో జిల్లా కేంద్రం రైల్వేస్టేషన్ సమీపంలో రైల్వేట్రాక్ దాటుతుండగా గుర్తుతెలియని దుండగులు యశోద మెడలో ఉన్న 4 తులాల బంగారు పుస్తెలతాడు, నల్లపూసల గొలుసు మెడలో నుంచి లాక్కొని రైల్వేట్రాక్ మీదుగా ఖమ్మం వైపు వెళ్లినట్లు పేర్కొన్నారు. బాధితురాలు యశోద ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సురేష్ తెలిపారు.

మద్యం షాపులో చోరీ

గూడూరు, మే 1 : గుండెంగలోని శ్రీవేంకటేశ్వర వైన్స్‌లో మంగళవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు రూ.43,800 విలువైన మద్యం బాటిళ్లతో పాటు రూ.16120 నగదను అపహరించుకుపోయినట్లు సీఐ బాబురావు, ఎస్సై నగేష్‌లు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న వారు గుండెంగకు చేరుకుని వైన్స్‌షాపులో చోరీ జరిగిన తీరును పరిశీలించారు. వైన్స్‌షాపు గోడకు రంధ్రం చేసి మద్యం, నగదును అపహరించుకుపోయినట్లు వారు తెలిపారు. షాపులో పనిచేస్తున్న చంద్రమోహన్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

డోర్నకల్‌లో గంజాయి పట్టివేత

డోర్నకల్, మే 1 : ప్రభుత్వ నిషేధిత గంజాయిని తరలిస్తున్న ఒడిస్సాకు చెందిన ఓవ్యక్తిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు సీఐ ఉపేందర్‌రావు తెలిపారు. బుధవారం సీఐ తెలిపిన వివరాల ప్రకారం. ఒడిస్సా రాష్ట్రం కందమల్ జిల్లా గురుపడకు చెందిన బిజయదిగల్ అనే వ్యక్తి బ్యాగులలో గంజాయి ప్యాకెట్లు పెట్టుకుని మంగళవారం సాయంత్రం డోర్నకల్‌కు వచ్చాడు. మెయిన్ రోడ్డులోని పాత పోలీస్‌స్టేషన్ వద్ద బ్యాగులతో నిలబడి ఉన్నాడు. అటుగా వచ్చిన ఎస్సై కె.తిరుపతి, సిబ్బందిని చూసి కంగారు బ్యాగులను ఒకచోట దాచిపెడుతుండగా అనుమానం వచ్చిన ఎస్సై, పోలీసులు అతని బ్యాగులను తనిఖీ చేశారు. అందులో 19.4 కిలోల ఎండుగంజాయి ఉన్నట్లు గుర్తించారు. తర్వాతవెంటనే గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గంజాయి విలువ సుమారు రూ.3.88 లక్షలు ఉంటుందని తెలిపారు. ఈ గంజాయిని బిజదిగల్ మహారాష్ట్రకు తరలించే క్రమంలో పోలీసులకు పట్టుబడినట్లు చెప్పారు. అతడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.


మరిపెడలో జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు



దోర్నకల్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో..


బయ్యారంలోని తెలంగాణ అమరవీరుల స్తూపం..


నర్సింహులపేటలో మేడే వేడుకలో ఉపాధిహామీ కూలీలు

ఊరూరా ప్రపంచ కార్మికుల దినోత్సవం

మహబూబాబాద్ టౌన్, మే 1 : జిల్లా వ్యాప్తంగా ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని బుధవారం ఘనంగా జరుపుకున్నారు. అన్ని మండలకేంద్రాలు, గ్రామాల్లో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మేడేను నిర్వహించారు. కార్మికులు ఊరూరా ఎర్రజెండాలను ఎగురవేశారు.

● సీపీఎం, సీఐటీయూ ఆధ్వర్యంలో మహబూబాబాద్ మండలంలోని మాధవాపురం, అమనగల్, జంగిలిగొండ, మల్యాలల్లో మేడే వేడుకలు నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గునిగంటి రాజన్న, మండల కార్యదర్శి దుడ్డెల రాంమ్మూర్తి, గణేష్, సురేష్, యూసఫ్, ఖాదర్, మహేష్, సమ్మయ్య లింగన్న, సుధాకర్, లచ్చిరాం, జోగినాయక్ పాల్గొన్నారు.

● కంబాలపల్లి, బొడగుట్టతండా, లక్ష్మీపురం గ్రామాల్లో ఇఫ్టూ ఆధ్వర్యంలో మేడేను నిర్వహించారు. నాగరాజు, బాలమల్లు, చారీ హరీష్, భట్టు చైతన్య పాల్గొన్నారు.

● మరిపెడ మునిసిపల్ కేంద్రంలో సీపీఐ, సీపీఎం, సీఐటీయూ, ఏఐటీయూసీ, భవన నిర్మాణ కార్మికులు, హమాలీ, ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో అల్వాల వీరయ్య, మారగాని బాలకృష్ణ, దుండి వీరన్న, బానాల రాజన్న, బానోత్ రాంలాల్, కొండ ఉప్పలయ్య, అబ్దుల్ రషీద్ పాల్గొన్నారు.

● ఉల్లెపల్లి శివారు లూనావత్‌తండా, అబ్బాయిపాలెం, గిరిపురం, తానంచెర్ల, రాంపురం, ఎల్లంపేటలో ఉత్సవాలు నిర్వహించారు. మాజీ సర్పంచ్ పానుగోతు రాంలాల్, జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి గుగులోతు రవినాయక్, సీపీఎం నాయకులు అల్వాల వీరయ్య సీపీఐ మండల కార్యదర్శి మారగాని బాలకృష్ణ పాల్గొన్నారు.

● కేసముద్రంలో మేడే ఉత్సవాల్లో ఇఫ్టూ జాతీయ అధ్యక్షుడు సాధినేని వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి శివ్వారపు శ్రీధర్, రావాడ శ్రీను, ఎన్డీ జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య, భట్టు నాగేశ్వర్‌రావు, సీఐటీయూ అనుబంధ భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు ముల్క మురళి, కార్యదర్శి గుంజ పొడుగు శ్రీను, మార్తినేని పాపారావు, తాడబోయిన శ్రీశైలం, జల్లె జయరాజ్, మోడెం వెంకటేశ్వర్లు, చాగంటి కిషన్, ఏఐసీటీయూ జిల్లా అధ్యక్షుడు కంచ వెంకన్న, బండి సంతోష్, వేల్పుల వెంకన్న, కరుణాకర్, ఇఫ్టూ జిల్లా సహాయ కార్యదర్శి కన్నంతరెడ్డి భాస్కర్‌రెడ్డి, నేరెళ్ల బలరాం, పైండ్ల శ్రీనివాస్, నాయీ బ్రాహ్మణసంఘం మండల అధ్యక్షుడు లింగాల నేతాజి, అర్పనపల్లి మిడ్‌వెస్ట్ గ్రానైట్స్‌లో సింగని రవి, షేక్ ఖాదర్ పాల్గొన్నారు.


తొర్రూరు ఆర్టీసీ డిపోలో వేడుకలు నిర్వహిస్తున్న కార్మికులు


కేసముద్రంలో జెండా ఎగురవేస్తున్న సీఐటీయూ నాయకులు

● గార్ల మండల కేంద్రంలో మేడే ఉత్సవాలు వివిధ రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో నిర్వహించారు. సీపీఎం మండల కార్యదర్శి కందునూరి శ్రీనివాస్, సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యులు కట్టెబోయిన శ్రీనివాస్, న్యూడెమోక్రసీ నాయకులు జి.సక్రు, జడ సత్యనారాయణ పాల్గొన్నారు.

● బయ్యారం మండలంలో వామపక్ష నేతలు మేడే కార్యక్రమాన్ని నిర్వహించారు. సీపీఎం, సీపీఐ, సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీతో పాటు అనుబంధ కార్మిక సంఘాలు ఆయా పార్టీలకు చెందిన అమరవీరుల నేతల స్థూపాలతో పాటు తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి, నివాళ్లర్పించారు. మండలంలో వామపక్ష నేతలు మేడే కార్యక్రమాలో ప్రదర్శన చేపట్టారు. వేర్వేరుగా జరిగిన కార్యక్రమాల్లో నాయకులు సాధినేని వెంకటేశ్వర్‌రావు, ఐలయ్య, రాజన్న, మధు, సూర్యం, వెంకటేశ్వర్లు, సత్యం, జగ్గన్న, వీరభద్రం, బిక్షం, యాకయ్య, వెంకన్న, యాకూబ్, మోహన్ పాల్గొన్నారు.

● తొర్రూరులో మేడే వేడుకలు నిర్వహించారు. భారత కార్మిక సంఘాల సమాఖ్య, ఏఐటీయూసీ, సీఐటీయూ, సీపీఎం, సీపీఐ, వివిధ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నాయకులు జెండాను ఆవిష్కరించారు. ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి రవి, సీపీఐ సీనియర్ నాయకుడు తమ్మెర విశ్వేశ్వర్‌రావు, సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బొల్లం అశోక్, మండల కార్యదర్శి ఎండి.యాకూబ్, వీరన్న, ప్రసాద్, శ్రీను, ఆర్టీసీ నాయకులు ఎం.కృష్ణారావు, జేవై.గిరి, ఎంఏ, చారి పాల్గొన్నారు.

● నర్సింహులపేట మండల కేంద్రంతో పాటు బొజ్జన్నపేట, కౌసల్యదేవిపల్లి, జయపురం, కొమ్ములవంచ, పడమటిగూడెం, పెద్దనాగారం గ్రామాల్లో వేడుకలు జరిగాయి. బేతమల్ల రవి, పి.అశోక్, రామస్వామి, సమ్మెట లలిత పాల్గొన్నారు.

● పెద్దవంగరలో మండలంలో మేడేను నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో కుమార్, వీరయ్య మహేందర్, అశోక్, శ్రీనివాస్, నారాయణ, రమేష్ పాల్గొన్నారు.

● డోర్నకల్ మునిసిపల్ కేంద్రంలో సీపీఎం, కాంగ్రెస్ ఆధ్వర్యంలో మేడే వేడుకలు నిర్వహించారు. సీఐటీయూ, డోర్నకల్ అశోక్ భవన్ నుంచి సుభాష్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. కాంగ్రెస్ అనుబంధ ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో అశోక్ భవన్ నుంచి గాంధీసెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి సంఘం పతకాన్ని ఆవిష్కరించారు. నాయకులు ఉప్పనపల్లి శ్రీనివాస్, బొమ్మన అశోక్‌కుమార్, దాసరి మల్లేశం, జేవీఆర్, పున్నయ్య, వాల్యనాయక్, కాలసుమీర్‌చంద్‌జైన్, మాద శ్రీనివాస్, తాళ్లూరి హనుమ, బత్తుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

● గంగారంలో సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా ఆధ్వర్యంలో మేడేను నిర్వహించారు. పూనెం ప్రభాకర్, ఈక బిక్షం, జోగ రామయ్య, సతీష్, సురేష్, వెంకన్న, అశోక్ పాల్గొన్నారు.

● కొత్తగూడలో సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలో తాపీ కార్మికులు బత్తుల గణేష్, తమ్మిశెట్టి ప్రసాద్, యాకయ్య, నరేందర్, ప్రసాద్, ప్రభాకర్, హన్మంతరావు, భద్రయ్య, ఇఫ్టూ ఆధ్వర్యంలో నామోజు కృష్ణ, ప్రభాకర్, కొనకాటి మల్లయ్య, రాజమల్లు, తాటికాయల వెంకట్ పాల్గొన్నారు.

● నెల్లికుదురులో సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ, సీపీఎం, సీపీఐ ఆధ్వర్యంలో హమాలీ కార్మికులు, ఆటో యూనియన్ నాయకులు, కార్మికులు జెండాను ఆవిష్కరించారు.పెరుమాండ్ల తిలక్‌బాబు, బాబుగౌడ్, ఇస్సంపల్లి సైదులు, వరిపెల్లి వెంకన్న, ఆలకుంట్ల సాయిలు, బండపల్లి వెంకటేశ్వర్లు, మల్యాల వెంకటేష్, సాయిలు, అశోక్, తొట్ల వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

● కురవిలో సీపీఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మేడే వేడుకలు నిర్వహించారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి, కర్నం రాజన్న, బొల్లం ఉప్పలయ్య, కలగూర నాగరాజు, దడిగెల నర్సయ్య, బుర్ర సమ్మయ్య, బుడమ వెంకన్న, కన్నె వెంకన్న, నాగేశ్వర్‌రావు, కొంతం మహేష్, గురువయ్య, కందుల యాకయ్య, గజ్జెల వీరన్న సీపీఎం ఆధ్వర్యంలో మండల కార్యదర్శి మలేడి కోటయ్య, ఆమెడ నాగయ్య, నల్లపు సుధాకర్, గంధసిరి శ్రీనివాస్, జంగం ఉప్పలయ్య, పిట్టల వెంకన్న, జ్యోతిబసు, పిట్టల దర్గయ్య పాల్గొన్నారు. ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు కోటేష్, సామ పాపయ్య, బిక్షం, రవి, ఎస్‌కె.జానీ పాల్గొన్నారు.

● గూడూరులో మేడే వేడుకల్లో ఎంసీపీఐ రాష్ట్ర నాయకులు పానుగంటి నర్సయ్య బానోత్ లాలు, ఎంసీపీఐ (యూ) జిల్లా సహాయ కార్యదర్శి నూకల ఉపేందర్, బందెల వీరస్వామి, ఈసం రామయ్య, కటకం బుచ్చిరామయ్య సత్యం, రాములు, స్వామి, రంజిత్, వెంకన్న, రాజు, ఐఎఫ్‌టీయూ నాయకులు ఈరెల్లి మల్లేష్ గొట్టం చిన్నకుమారస్వామి, మన్మోహన్‌రెడ్డి, నర్సయ్య, జనార్ధన్, వెంకన్న పాల్గొన్నారు.


బయ్యారంలో బస్సులోంచి ప్రజలకు అభివాదం తెలుపుతున్న మాజీ సీఎం కేసీఆర్

బయ్యారంలో కేసీఆర్ అభివాదం

బయ్యారం, మే 1 : మాజీ సీఎం కేసీఆర్ బుధవారం బయ్యారం బస్టాండ్ సెంటర్‌లో ప్రజలకు అభివాదం చేశారు. మహబూబాబాద్ పట్టణంలోజరిగే రోడ్‌షో, కార్నర్ మీటింగ్‌కు హాజరయ్యేందుకు కేసీఆర్ కొత్తగూడెం నుంచి రోడ్డు మార్గం ద్వారా టేకులపల్లి, ఇల్లందు, బయ్యారం మీదిగా బస్సులో బయలు దేరారు. ఈ క్రమంలోనే బస్టాండ్ సెంటర్‌లో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ అంగోత్ బిందు నేతృత్వంలో బీఆర్ఎస్ నాయకులు, అభిమానులు, ప్రజలు భారీ సంఖ్యలో గుమ్మిగూడటంతో కేసీఆర్ ఆగి బస్సులోంచే ప్రజలకు అభివాదం తెలుపుకుంటూ వెళ్లారు. అలాగే బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు, మానుకోట పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి మాలోత్ కవిత అభివాదం చేశారు.

ఆటో బోల్తా : ఏడుగురికి గాయాలు

● మాజీ సీఎం సభకు వచ్చి వెళ్తుండగా ఘటన

మహబూబాబాద్ రూరల్, మే 1 : జిల్లాలోని గార్ల మండలం ముల్కనూరు శివారు గుంపెళ్లగూడెం వద్ద ఆటో బోల్తాపడి, ఏడుగురికి తీవ్ర గాయాలైన సంఘటన బుధవారం రాత్రి చోటు చేసుకుంది. బాధితులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం. గార్ల మండల కేంద్రానికి చెందిన గాజుల మాధవి, హైమావతి, లక్ష్మి, ఉమ, అనసూర్య, పిచ్చయ్య, మధులో పాటు మరో ముగ్గురు వెరసి 10 మంది మహబూబాబాద్‌లో జరిగిన మాజీ సీఎం కేసీఆర్ రోడ్‌షోకు ఆటోలో వచ్చారు. సమావేశం అనంతరం తిరిగి అదే ఆటోలో వెళ్తున్న క్రమంలో గార్ల మండలం ముల్కనూరు శివారు గుంపెళ్లగూడెం సమీపంలో ఆటోకు ఎదురుగా కుక్క అడ్డురావడంతో దానిని తప్పించబోయిన క్రమంలో ఆటో అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో ఏడుగురు తీవ్ర గాయాలు కాగా, మరో ముగ్గురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. చికిత్స నిమిత్తం స్థానికులు 108 ద్వారా మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి మాలోతు కవిత, ఇల్లందు మాజీ ఎమ్మెల్యే హరిప్రియ జిల్లా ఆస్పత్రికి చేరుకుని క్షతగాత్రులను పరామర్శించారు. వారికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.






ఆటో బోల్తాపడిన ఘటనలో గాయపడిన మహిళలు

అవయవ దానం చేసేందుకు ముందుకు వచ్చిన..

వార్డు కౌన్సిలర్ పుష్పలత, తనయుడు మురళీధర్‌రెడ్డి

● అంగీకార పత్రాలను అందించిన తల్లి, కుమారుడు

మహబూబాబాద్ టౌన్, మే 1 : పట్టణంలో అవయవ దానం చేసేందుకు వార్డు కౌన్సిలర్ యాళ్ల పుష్పలత, ఆమె కుమారుడు బీఆర్ఎస్ యూత్ అర్బన్ అధ్యక్షుడు యాళ్ల మురళీధర్‌రెడ్డి ముందుకు వచ్చారు. అవయవ దానం అంగీకార పత్రాలను బుధవారం తెలంగాణ నేత్ర అవయవ శరీరదాతల సంఘం బాధ్యులకు అందించారు. బీఆర్ఎస్ యూత్ అర్బన్ అధ్యక్షుడు యాళ్ల మురళీధర్‌రెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని అవయవదానం చేసేందుకు ఆయనతోపాటు తల్లి యాళ్ల పుష్పలత నిర్ణయం తీసుకున్నారు. అంగీకార పత్రాలను తెలంగాణ నేత్ర అవయవ శరీర దాతల సంఘం జిల్లా అధ్యక్షుడు పర్కాల రవీందర్‌రెడ్డికి అందజేశారు. మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి, ఫ్లోర్ లీడర్ చిట్యాల జనార్దన్, ఐఆర్‌సీఎస్ జిల్లా చైర్మన్ పీవీ. ప్రసాద్, గోపాలఝూవర్, డాక్టర్ వి.జగన్మోహన్‌రావు, కొండపల్లి కరుణాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కొచ్చెర్ల సూచనరాయ్, కర్పూరపు గోపి, డౌలాగర్ శంకర్, నీలేష్‌రాయ్ పాల్గొన్నారు.


రవీందర్‌రెడ్డికి అవయవ దాన అంగీకార పత్రాలను అందిస్తున్న వార్డు కౌన్సిలర్

బలరాంనాయక్ గెలుపు కోసం ప్రచారం

గార్ల, మే 1 : కాంగ్రెస్ మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థి పోరిక బలరాంనాయక్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ బుధవారం గార్లలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు కొత్తగూడెం భద్రాద్రి జిల్లా కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ రవినాయక్ నేతృత్వంలో కాంగ్రెస్ నాయకులు గడపగడపకు తిరిగి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బలరాంనాయక్ విజయం ఖాయమని అన్నారు. సీపీఎం మండల కార్యదర్శి కందునూరి శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు తాళ్లపల్లి కృష్ణాగౌడ్, షంషాద్ బేగం, దీకొండ రాము, ధరవత్ వీరన్న, కళ్యాణ్, మురళి, తిరుమల, దరావత్ కృష్ణ పాల్గొన్నారు.

కురవిలో ఇంటింటా..

● కురవి : కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి బలరాంనాయక్ గెలుపును కాంక్షిస్తూ బుధవారం కాంగ్రెస్ శ్రేణులు కురవిలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో దేశంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడడం ఖాయమని, ప్రజలందరూ కాంగ్రెస్‌కు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్రెసిడెంట్ ఎన్.రాజేందర్ కుమార్, కాంగ్రెస్ నాయకులు ఎర్ర నాగేశ్వర్‌రావు, బానోత్ తుకారం నాయక్, కామిండ్ల వీరన్న, బెడద విశ్వనాథం, బత్తిని సత్తయ్య, మిరియాలలక్ష్మయ్య, బానోత్ లక్ష్మణ్‌నాయక్, గాజుల వీరన్న, ధైద భద్రయ్య, పానుగంటి వీరన్న పాల్గొన్నారు.

తాగునీటి కోసం మహిళల ఆందోళన

కొత్తగూడ, మే 1 : తాగునీటి కోసం మహిళలు రోడ్డెక్కారు. బుధవారం సరసనపల్లిలో నీళ్ల కోసం బిందెలతో ఆందోళన చేపట్టారు. సరసనపల్లి గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం. గత కొన్నిరోజులుగా రెండు బిందెల నీళ్లు మాత్రమే వస్తున్నాయి. బుధవారం ఉదయం 10 గంటల వరకు నీళ్లు రాలేదు. దీంతో మహిళలు బిందెలతో రోడ్డెక్కి, ఆందోళన చేపట్టారు. ఈ విషయం తెలుసుకున్న మిషన్ భగీరథ ఏఈ నరేష్, జీపీ సెక్రటరీ ఇంద్రజ సరసనపల్లికి చెరుకుని మధ్యాహ్నం 12గంటలకు మిషన్ భగీరథ ట్యాంక్‌లోకి నీటిని నింపారు. అనంతరం గ్రామస్తులకు నీటిని సరఫరా చేశారు. గ్రామంలోని బోరుబావులకు మరమ్మత్తు చేయిస్తామని స్థానికులకు అధికారులు హామీ ఇచ్చారు.

బీఆర్ఎస్, బీజేపీ మాటలను నమ్మరు

మరిపెడ రూరల్, మే 1 : మహబూబాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పోరిక బలరాంనాయక్ మూడు లక్షల ఓట్ల మెజార్టీతో గెలుపు తథ్యమని జిల్లా ప్రధాన కార్యదర్శి గుగులోతు రవినాయక్ ఆశాభావం వ్యక్తం చేశారు. బుధవారం లూనవత్ తండా జీపీలో ప్రచారాన్ని నిర్వహించి, ఆయన మాట్లాడారు. మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు అజ్మీరా శ్రీను, లూనవత్‌తండా గ్రామపార్టీ అధ్యక్షుడు వెంకన్న, లూనవత్ లఝ్మతి, తిరుపతి, భాస్కర్, బిచ్చు పాల్గొన్నారు.

మహిళలకు ఉచిత శిక్షణ

నర్సింహులపేట, మే 1 : ఉపాధి హామీ పనుల్లో వంద రోజుల పని దినాలు పూర్తిచేసిన మహిళలకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఏపీవో భూపాల్‌రెడ్డి బుధవారం తెలిపారు. వందరోజుల పని దినాలు పూర్తి చేసిన 18 నుంచి 45 సంవత్సరాలు లోపు మహిళలకు 13 రోజుల పాటు మరిపెడలో రోజువారీ వేతనంగా రూ.300 చెల్లిస్తూ శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఉత్సాహవంతులైన మహిళలు ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, జాబ్ కార్డు, బ్యాంకు అకౌంట్ జిరాక్స్‌తో పాటు నాలుగు పాస్ ఫోటోలు స్థానిక ఫీల్డ్ అసిస్టెంట్, ఉపాధి హామీ సిబ్బందికి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

'బాలకార్మికులను పనుల్లో పెట్టుకోవద్దు'

మహబూబాబాద్ రూరల్, మే1 : బాలకార్మికులను పనుల్లో పెట్టుకోవడం చట్టరీత్యానేరమని మానుకోట సీనియర్ సివిల్ జడ్జీ సురేష్ అన్నారు. మహబూబాబాద్‌లోని భవన నిర్మాణ కార్మిక భవనంలో బుధవారం న్యాయ చైతన్య సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 14ఏళ్లలోపు పిల్లలను పనుల్లో పెట్టుకోవడం చట్ట రీత్యా నేరమని, అందుకు కఠినమైన చట్టాలు అమలులో ఉన్నాయన్నారు. పిల్లలందరూ చదువుకోవాలని, వారిని పనుల్లో కాకుండా పాఠశాలల్లో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. భవన నిర్మాణ కార్మికులు, ఇతర ప్రమాదకర పనుల్లో పనిచేసే కార్మికులకు యాజమాన్యం అన్ని రకాలరక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. టౌన్ ఎస్సై అరుణ, కోర్టు లైజన్ ఆఫీసర్ సంపత్‌రెడ్డి, ట్రాఫిక్ ఎస్సై శ్యాంసుందర్, పట్టణ భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు శంకర్ మేస్త్రీ, కార్మికులు పాల్గొన్నారు.

'సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలి'

తొర్రూరు, మే 1 : మహిళలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో సిలార్ సాహెబ్ అన్నారు. బుధవారం తొర్రూరులోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో డీఆర్‌డీఏ మహబూబాబాద్ వారి సహకారంతో ఈజీఎస్ పథకంలో 2018-19, 2023-24 సంవత్సరాల్లో వంద రోజులు పనిచేసిన మహిళలకు మగ్గం వర్క్, జూట్ బ్యాగ్‌ల తయారీపై ప్రత్యేక శిక్షణ ఇస్తామని తెలిపారు. 18 నుంచి 45 సంవత్సరాలు ఉన్న మహిళలకు శిక్షణ, రోజువారి వేతనం, భోజన సదుపాయం ఉంటుందని, అర్హత గల వారందరూ గ్రామాల్లోని ఈజీఎస్ సిబ్బంది వద్ద దరఖాస్తు చేసుకోవాల న్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్‌తో పాటు ఉచిత టూల్ కిట్ అందజేస్తామన్నారు. మరిన్ని వివరాలకు పంచాయతీ కార్యదర్శిని సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ లక్ష్మీప్రసన్న, ఏపీవో మధు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పార్టీలో చేరిక

తొర్రూరు, మే 1 : మండలంలోని వెంకటాపురం గ్రామ ఎంపీటీసీ భర్త జాటోత్ రాజేందర్ గత కొన్ని రోజుల క్రితం కాంగ్రెస్ పార్టీలో చేరారు. బుధవారం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సమక్షంలో వర్ధన్నపేటలో నిర్వహించిన పార్టీ సమావేశంలో తిరిగి బీఆర్ఎస్ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ సీనియర్ నాయకుడు డాక్టర్ సోమేశ్వర్‌రావు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో అంతర్గత పోరువల్ల పార్టీలో ఇమడలేక తిరిగి సొంతగూటికి చేరుకున్నారని తెలిపారు. పార్టీ నాయకులు జాటోత్ సురేష్ ఉన్నారు.

బలరాంనాయక్ గెలుపునకు కృషి చేయాలి

గూడూరు, మే 1 : మహబూబాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి పోరిక బలరాంనాయక్ గెలుపు కోసం ప్రతీ ఒక్కరు కృషి చేయాలని గూడూరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కత్తిస్వామి, సొసైటీ చైర్మన్ చల్లా లింగారెడ్డి, మహిళ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు నూనావత్ రాధ పిలుపునిచ్చారు. గూడూరు మండల కేంద్రంలో బుధవారంవెంగంపేట, భూపతిపేట, రాజన్‌పల్లి, సీతానగర్, గూడూరు, రాములుతండాలకు చెందిన బీఆర్ఎస్, బీజేపీ కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. వారికి పార్టీ కప్పి, సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బలరాంనాయక్‌కు తమ ఓట్లువేసి భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలో కాంగ్రెస్‌కు గూడూరు నుంచి అత్యధిక మెజార్టీ ఇవ్వాలని కోరారు. నాయకులు కంకటి ఉప్పలయ్య, అమరేందర్ రెడ్డి, యాకూబ్ పాష, వేం శ్రీనివాస్ రెడ్డి, కన్నబోయిన వెంకన్న, పెసరు శివ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

పార్టీ వ్యతిరేక శక్తులతో కలిస్తే చర్యలు

● కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చిట్టె వెంకటేశ్వర్లు

గూడూరు, మే 1 : కాంగ్రెస్ పార్టీ వ్యతిరేక శక్తులతో కలిస్తే.. క్రమశిక్షణ చర్యలు తప్పవని ఆ పార్టీ మండల అధ్యక్షుడు చిట్టె వెంకటేశ్వర్లు హెచ్చరించారు. గూడూరులో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీలో ఎవరైనా చేరాలంటే పార్టీ జిల్లా అధ్యక్షుడు భరత్‌చందర్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్, స్థానిక నాయకత్వం అభిష్టం మేరకే ఉంటుందన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి వాంకుడోతు కొమ్మాలు, బీరం శ్రీపాల్ రెడ్డి, బోయినపల్లి సతీష్‌రావు, బొల్లికొండ మధు, ఆర్రెం వీరస్వామి, రేగ వెంకటేశ్వర్లు, సమ్మెట శ్రీనివాస్, గడీల రమేష్, చంటి స్వామి, మాదాసు రమేష్, మంగీలాల్, యాదవరెడ్డి, రవిసింగ్‌రాథోడ్ పాల్గొన్నారు.

వేసవి శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

కేసముద్రం, మే 1 : వేసవి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకొని క్రీడల్లో నైపుణ్యం పెంపొందించుకోవాలని జిల్లా యువజన క్రీడలశాఖ బాస్కెట్ బాల్ కోచ్ వెలిశాల కుమారస్వామి అన్నారు. మండలంలోని కల్వల మోడల్ స్కూల్లో జిల్లా యువజన క్రీడలశాఖ ఆధ్వర్యంలో బేస్‌బాల్ వేసవి శిక్షణ శిబిరాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు వేసవి సెలవులను వృథా చేయకుండా శిక్షణ శిబిరంలో క్రీడలో మెళకువలు అభ్యసించి జాతీయ, అంతర్జాతీయస్థాయికి ఎదగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బేస్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కల్లూరి ప్రభాకర్, ఉప్పాల సంజీవరావు, పీఈటీ లలిత, రూప్‌లాల్, బాలోజీ పాల్గొన్నారు.

డోలి కుటుంబసభ్యులకు ప్రముఖుల పరామర్శ

మహబూబాబాద్ టౌన్, మే 1: జిల్లా కేంద్రంలో టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు, నలంద విద్యాసంస్థల కరస్పాండెంట్ డోలి సత్యనారాయణ, మాజీ కౌన్సిలర్ డోలి లింగుబాబును బుధవారం పలువురు ప్రముఖులు పరామర్శించారు. డోలి సత్యనారాయణ, లింగుబాబు తల్లి ఎల్లమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన విషయం విధితమే. విషయం తెలుసుకున్న వివిధ పార్టీలు, సంఘాల నేతలు, ప్రజా ప్రతినిధులు రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, రిటైర్డ్ ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ, డీసీసీ అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్‌చందర్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్, మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్, మాజీ ఎంపీ అజ్మీర సీతారాంనాయక్, మాజీ ఎమ్మెల్సీ కపిలవాయి దిలీప్‌కుమార్, మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, మర్రి రంగారావు, డాక్టర్ బానోత్ నెహ్రూరాథోడ్, ఎమ్డీ.ఫరీద్, చిట్యాల జనార్ధన్, ఎడ్ల వేణు, ఎడ్ల రమేష్, ఘనపురపు అంజయ్య, మండల వెంకన్న, షైస శ్రీనివాస్, పమ్మి రాజు, గుండా రాజశేఖర్, ఖలీల్‌అహ్మద్, భూక్య నెహ్రూనాయక్, బొడ్డుపల్లి ఉపేంద్రం, కామ సంజీవరావు, చిలువేరు సమ్మయ్య తదితరులు ఎల్లమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.


డోలి ఎల్లమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర